★ దొంగ ★

[కథానిక]

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

తేలుకుట్టినట్టు చిందులుతొక్కసాగాడు శివయ్య. పదినిమిషాలక్రితం-పదినిమిషాలు కూడా ఐందో లేదో—ఆ అలమారులో, తన సొంతచేత్తో — అందులోనూ ఎడంచెయ్యి కాదు, కుడిచేత్తో — పెట్టిన యాభైనాలుగు రూపాయలూ, స్నానంచేసివచ్చి చూసుకునేప్పటికి—ఎంత పాపిష్టిరూపాయలో — అక్కడ లేవు! అలమారుతలుపు మూసి మళ్లీ తెరిచి చూశాడు శివయ్య— ఏ పరాశక్తి అయినా పోయిన డబ్బు తెచ్చి గారడీగా అక్కడ పెడుతుందేమో నన్నట్టు. అదిక్కుమాలిన అలమారు తలుపు ఎన్నిసార్లు మూసి తెరిచినా అక్కడ ఉండవలిసిన డబ్బుమటుకు లేదు. పోనీ ఆ డబ్బక్కడ పెట్టలేదేమో అనుకోటానికి ఆ అలమారు చెక్కమీద ఆనలిగిన పదిరూపాయల నోట్లూ, బొత్తిగా పెట్టిన ఆవెండిరూపాయలూ, కన్నులఅంచులతో సహా, ఫొటో ఎత్తినట్టు తన కళ్ల ఎదుట ఇంకా కనిపిస్తూంటేనే! అదృశ్యం కంటికి కట్టినప్పుడల్లా, పోయినమనిషిఫోటో కనిపించినట్టుగా, ఆవురుమని శివయ్యకు దుఃఖం పొర్లుకు రాసాగింది. పాపం, ఆనలిగిన పదిరూపాయలనోట్లూ, ఆ అమాయకపురూపాయలూ ఎవరికీ ఎటువంటి ద్రోహమూ చేసి ఎరగవే! వాటి నెత్తుకుపోవటానికి ఏ దుర్మార్గుడికి చేతు లొచ్చినయ్యో! ఆ డబ్బు తాలూకు సూక్ష్మశరీరాలు అదృశ్యంగా ఇంకా అక్కడే ఉండి తనను పిలుస్తున్నట్టుగా ఉంది శివయ్యకు!

నిశ్చలంగా నిలబడలేకుండా ఉన్నాడు శివయ్య. గుండె ఆత్రం చెప్పనలవిగాకుండా ఉంది. ఆలోచనకూడా తట్టటంలేదు. ఆలోచిస్తేగాని ఈ దిక్కుమాలిన దొంగతనం బయట పడదాయె!

"ఏ—ఏ మేవ్! ఇదుగో! ఇట్లా ఓ—ఓ సారావే!" అంటూ పెడబొబ్బపెట్టాడు శివయ్య. ఆయన గొంతు ఆయన అనుకున్నకన్న ఎక్కువ బిగ్గిరిగా అరిచింది. కాని శివయ్య ఆత్మవిమర్శ చేసుకునేస్థితిలో లేడు. స్వార్థంతో గూడిన ఉద్రేకం అంత పాపిష్టిది!

వంట పూర్తిచేస్తున్న వెంకాయమ్మ భర్త కేక విని ఆదరాబాదరా పరిగెత్తుకొచ్చింది. ఆ కేక విని ఆయనకు ఏతేలో కుట్టిందని కలిగిన సందేహం ఆయనవాలకం చూసి మరింత బలపడింది.

"ఎక్కడండీ? కనిపించిందా?" అన్నది వెంకాయమ్మ.

తను అడగబోతున్న ప్రశ్న తనభార్య నోటే విని మొదట నిర్ఘాంతపోయిన శివయ్య, మరుక్షణం, "ఇది దీనిపనే!"అని రూఢిచేసుకుని, "ఏదీ? ఏదీ? భద్రంగా పెట్టావా?"అని అడిగాడు.

"ఏమిటేది? భద్రంపెట్టట వేమిటి నాతలకాయ!" అన్నది వెంకాయమ్మ, ఇటువంటి పిచ్చివాడికోసం ఆదుర్దా పడ్డందుకు తనకు తనే జాలిపడుతూ.

"అదేనే? నువ్వు తియ్యలా?"

"మళ్లీ అమాటేనా? ఏమిటి తీసింది?"

"డబ్బు"అనే రెండక్షరాలూ శివయ్యగారి నోట పెగల్లా. తనభార్య ఆడబ్బు తియ్యలేదని రూఢి అయిపోయింది. కాకపోయినా మడి గట్టుకున్నమనిషి పనివేళా వచ్చి అలమారు సవరిస్తుందా? "డబ్బు" అనేమాట నోటివెంటవస్తే కళ్లవెంట నీళ్లుకూడా వచ్చేట్టు కనిపించింది. ఆయన బిక్కమొహం వేసుకుని అలమారుకేసి చూస్తూ, "ఇందులో పెట్టానే! -పదినిమిషాలు కాలేదూ! ఇట్లా వచ్చి చూతునుగదా— లేదు! పోయింది!" అన్నాడు.

"లేదు—పోయింది!" అన్న మాటలు, ఆపోయినడబ్బు మళ్లా దొరకదనే శివయ్యగారి నిస్పృహను మహచక్కగా సూచించినై.

గాఢాంధకారంలో ఎలెక్ట్రిక్ దీపం వెలిగించినట్టు ఒక్కక్షణంలో వెంకాయమ్మగారికంతా అర్థమయింది.

"డబ్బేమైనా అలమార్లో పెట్టారా యేం? కనిపించలా?" అన్నదావిడ, "పారేసుకున్నా?" అని పెద్దవాళ్లు పిల్లల్నడిగినంత తీర్గా.

శివయ్యగారి గుండె దిగజారింది. ఇదివరకల్లా ఈదృష్టి ఆయనక్కలగలేదు. ఎవరో తన డబ్బు తీశారనే ఆలోచనా, వాళ్లు పాపంఅంట గట్టుకున్నారనే కోపమూతప్ప, తను పొద్దున్నే లేచి యాభైనాలుగు రూపాయలు పారేసుకున్న వాజ అయిన విషయం శివయ్యగారి కిప్పుడు గాని తట్టలేదు. నిజమే! ఎవరైనా తన్నడగ వచ్చు — ఎవరో ఎత్తుకు పొయ్యేటందుకు వీలుగా తను గట్టి తాళంలేని అలమారులో డబ్బెందుకు పెట్టాలి? ఈ ఆలోచనతో శివయ్య బొత్తిగా కుంగిపోయినాడు.

అయితే మనిషి మనస్తత్వం నీళ్లమీది బెండు వంటిది. బెండును ముంచటానికి మరిన్ని నీళ్లు పోస్తే ఆబెండు ఆనీళ్లమీదికి కూడా ఎక్కుతూ చుంటుంది. మనం ఏదన్నా తప్పుచేసినట్టు ఒక వంక రుజువవుతున్నప్పుడు, కనీసం మనకంటె తప్పుచేసినవాణ్ణి మరొకణ్ణి పట్టుకుని వాడికన్న మనం మంచివాడవుదామని ప్రయత్నిస్తాం. దేవుడా అంటూ మనతప్పు మనం ఒప్పుకోవలసి వచ్చినప్పుడుకూడా మన మాతప్పుచేసే పరిస్థితులకు కారణభూతుడు మరెవడన్నా ఉన్నాడని రుజువు చెయ్యటానికి ఎంతశ్రమ అయినా పడతాం. తప్పుచేసినదొవంకన్న దాన్ని ఆమోదించిన ఘనత ఎక్కువైనదని తోచినప్పుడు మాత్రమే మనం సంపూర్ణంగా తప్పొప్పుకుంటాం. మనని ప్రకృతి అట్లా చేసింది. దానికి మనం బాధ్యులం కాము మరి!

శివయ్య తనకంటె తప్పు చేసినవాళ్లకోసం మానసికంగా అన్వేషణ ప్రారంభించాడు. ఒక నిమిషంక్రితం అంతా అయోమయంగా ఉన్న శివయ్యమనసిప్పుడు యంత్రంమాదిరిగా పని చేస్తున్నది.

ఈడబ్బు తను అక్కడ పెడుతుండగా చూసినవారెవరూ? ఎవరూ లేరు. డబ్బు దాచేటప్పుడుగాని తీసేటప్పుడుగాని ఇంకోళ్లు చూస్తుంటే శివయ్య కేమిటోగా ఉంటుంది. శూద్రులు చూస్తుంటే భోంచేసే బ్రాహ్మడి కెట్లా ఉంటుందో అట్లా ఉంటుంది. జేబులో డబ్బులు గల గల్లాడినా అంతే. గలగల్లాడేవి కాన్లే అవుగాక. మనదగ్గిర రెండుకాన్లున్నట్టు ఇతరులకెందుకు తెలియాలి? కొందరు అణకువగల వాళ్లు తమ తెలివితేటలు దాచుకుంటే శివయ్య తనడబ్బు గోప్యంగా ఉంచుకుంటాడు. మన సరుకు చూసి ఇంకొడికన్నెర్రగావటం దేనికి? అమీదమనకు దిష్టితగలటం దేనికి? శివయ్య అవివేకి అనలేం.

ఎవరూ చూడకపోతే డబ్బేమైనట్టూ? పక్షవాతంతో మంచానపడి ఉన్న తనతండ్రి తీసి ఉండడుగదా! ఆయన లేచి తిరుగుతుంటేనా? అమ్మో, ఆయనకు అవతలిగదిలో ఉన్నడబ్బు వాసన ఇవతలగదిలో కొట్టుడుతుంది! తనతల్లి— గడచిన పావుగంటసేపూ ఆవిడేం చేస్తున్నట్టూ?

కట్టుకున్న తడితువాలాతో శివయ్య దొడ్డి యావత్తూ కలయజూసి వచ్చాడు. ఆయనతల్లి కొబ్బరిచెట్టుకింద కూచుని రాలిపోయిన మట్ట ఆకులకు ఈనెలు తీస్తున్నది. తల్లి, పాపం, ఎప్పుడూ ఇటువంటి ఆదాపన్లే చేస్తుంది. ఆవిణ్ణిఅనుమానించినవాడితల సహస్ర వక్కలు కావలసిందే!

ఈ ఆలోచన శివయ్యగారికి నిండా ఆనందం కలిగించిందిగాని మరుక్షణమే దొంగ ఇంకా దొరకలేదన్న ఆదుర్దాతరుముకొచ్చి ఆయన మనస్సును మూడ్డోగీరులోకి నెట్టింది.

అన్నట్టు తనకోడలిసంగతి ఏమిటి? తను స్నానానికి వెళ్లేటప్పటికి బావిదగ్గిర బట్టలు జాడిస్తూఉండిన సత్యవతి తనకు బొక్కెన ఖాళీ చేసి యిచ్చి ఎటు వెళ్లిందీ? చెంబు పట్టుకుని దొడ్డికి వెళ్లింది. తరవాత—

దొడ్డితలుపుగొళ్లెం చప్పుడయింది. సత్యవతి చెంబుతో తిరిగివస్తూండటం మామగారి కళ్లబడ్డది. ఆయన ఒక్కనిట్టూర్పుపుచ్చి, "ఇదీ వీళ్లనాన్నల్లేనే బ్రహ్మదేముడికినకలు!... డబ్బు తీసింది సత్యవతి కాదు." అనుకున్నాడు.

అయితే మరెవరు? ఇంకెవరూ? మనవాడే! మనసుపుత్రుడే! లక్ష్మీకాంతమే! ఏడీ వాడూ? ఏడీ ఆవెధవా; ఏడీ ఆ దొంగ భటాచోర్! ఎంతచదువు చదివి ఏలాభం? ఎమ్మే పాసయి ఏంలాభం!

సుడిగాలల్లే శివయ్య ఇల్లంతా, దొడ్డంతా తిరిగాడు, "ఒరేకాంతం? ఓరికాంతం!" అని పొలికేకలు పెట్టాడు. కాంతం ఎక్కడా కనిపించలేదు. తను స్నానానికి వెళ్లే టప్పుడు గదిలోకూర్చుని కూనిరాగాలు తీస్తున్న కాంతం అయిపులేడు.

డబ్బు దొరికినదాన్లో సగ మానందమన్నా కలుగుతుంది దొంగ దొరికితే!

శివయ్యకు సగంకంటె ఎక్కువానందమే కలిగింది. మరెవరెవరో కాకుండా తన సొంత కొడుకే దొంగ అని రుజువుచెయ్యగలగటం శివయ్యగారికి అంతులేని తృప్తినిచ్చినట్టు కనిపించింది.

కాంతం చిన్నప్పుడు తన జేబులో కాన్లూ అర్థణాలూ కొట్టేస్తూఉండేవాడు. ఇక సందేహం దేనికి? ఇది వాడిపనే!

శివయ్య మనస్తత్వం తెలుసుకోదగినది. ఆయన ఒక విచిత్రమైన లోభి. మనకు సారస్వతంలో ఎంతసేపటికీ పిసినిగొట్టుతనమే కనిపిస్తుందిగాని లోభంతాలూకు ఇతరస్వరూపాలు కనిపించవు. శివయ్యకు డబ్బంటే చాలా తీపి. కాని ఆయన డబ్బు ఖర్చుచేస్తాడు. దుర్వ్యయం కూడా చేస్తాడు. ఆయన రూపాయి ఖర్చుచేస్తే అందులో అర్థమం ఆరణా లెట్లా ఖర్చయిందీ చెప్పలేడు. కాని ఇంకోళ్లు తమ డబ్బునే అత్యావసరమైన ఖర్చుకు వినియోగిస్తున్నా గిలగిల్లాడతాడు. ఆయనకు డబ్బును ముట్టుకోవటం అమితఇష్టం. ఇంకోళ్లచేతిలో డబ్బు ఏమిషమీదన్నా సరే తీసుకుని దాన్ని తనివితీర స్పృశించి, ఎంచి, మళ్లీ ఇచ్చేస్తాడు. ఆమాట అని ఆయనచేతికి నోట్లకట్టలిచ్చి వాటిని చూసి ఆనందిస్తూ ఉండు అంటే లాభంలేదు. కొంతమంది లోభులకు నిలకడగా ఉన్న లక్ష్మిని చూస్తే ఇష్టం. ఈ లోభికి చలించే లక్ష్మిని చూస్తే ఇష్టం. ఆ లక్ష్మి తన చేతుల్లో ఆడాలి. అంతే శివయ్య కోరేది. లక్ష్మీకాంతం కాలేజీ చదువు కోసం ఊరు విడిచి పొయ్యేవరకూ అతని కే పుస్తకం కావలిసినా, వస్తువు కావలిసినా, "నేను తెచ్చిపెడతా గాదుట్రా?" అని శివయ్య ఒక్కొక్కప్పుడు ఒక దాని కొకటి తెచ్చి కొడుకుజీవితం దుఃఖభాజనం చేస్తూ ఉండేవాడు. ఎవరికేం కావలసినా తమ డబ్బు తీసుకుని బజారుకు వెళ్లి, కొని తెచ్చి ఇస్తూ, మంచి వస్తువులు తీసుకురానందుకు మాటలుపడుతూ ఉండేవాడు. కొందరు, "ఆహా, శివయ్య ఎంత పరోపకారపరుడు!" అనుకునేవాళ్లు. మరి కొందరు, "ఈ ముండాకొడుకు కాస్తో కూస్తో చేతివాటు వేస్తాడు!" అనుకునేవాళ్లు. మొత్తం మీద ఏదీ నిజంకాదు. శివయ్య అదో రకం లోభి.

శివయ్యకు మరో వింత అలవాటుకూడా ఉంది. ఆయనకు కేవలం డబ్బంటేనే కాక డబ్బిచ్చి తీసుకునే రసీదులంటేకూడా తగని ప్రీతి. ఒక్క రసీదు పొరపాటునకూడా పారెయ్యడు. ఆ రసీదులకు వాటిమీదఉండే అంకెల విలవఉన్నదనే ఆయన నమ్మకం. తను చేసేఖర్చు సగానికి సగం తేలేది కాకపోయినా ఆయన తప్పకుండా ఎకౌంటు వేస్తూ ఉండేవాడు.

పెద్దపెద్ద దొంగతనాలూ, అన్యాయార్జనలూ శివయ్యను ఆకర్షించేవి. ఒకడికి నెలకు వెయ్యిరూపాయల జీతమన్నా చలించని శివయ్య, ఎవడన్నా లంచాలు పట్టి నెలకు ఒక వంద సంపాదిస్తాడంటే ఆమనిషిని మరిచిపోలేకపొయ్యేవాడు. అందుకనే యాభైనాలుగు రూపాయలుపోయిన ఆదుర్దా కాస్తా, అది తీసిన వాడు తన కొడుకే ననే ఆలోచ కింద భూపానికి రాకుండా పోయింది.

"ఏమేవ్? చూశావా—మన ప్రబుద్ధుడేం చేశాడో! నే నా అలమార్లో పెట్టిన డబ్బు కాస్తా వాడే తీశాడు! తీసి—అయిపులేడు!" అన్నాడు శివయ్య భార్యతో.

"చాల్లెండి! చూసీచూడని మాట లనకండి! వాడెందుకు తీస్తాడూ? దొంగతనా లింటావంటా లేవే! వాడేం అజ్ఞానుడా! మీరే ఎక్కడ పెట్టి మరిచిపోయినారో! ఆ తడితువాలిక విప్పి మడిబట్ట కట్టరా?..." అంటూ గ్రంథం విప్పింది.

శివయ్యగారు సాలోచనగా భోంచేస్తుండగా లక్ష్మీకాంతం బయటినించే చొక్కా విప్పుకుంటూ లోపలి కొచ్చాడు, పెద్ద మహత్తర రాచకార్యం చక్కబెట్టి వచ్చినవాడల్లే.

"అదేదీ? స్నానం చేస్తాను, నీళ్లుతోడాలి!" అన్నాడు కాంతం.

ఇంతసేపూ శివయ్యగారు చేసిన ఆలోచన ఉపకరించింది. కొడుకు రాగానే విషయం ఎట్లా కదలింతామా అని ఆలోచనచేసిఉన్న శివయ్య ఇప్పు డొక్కదగ్గు దగ్గి, "అయితే, ఒరే, చూడూ!" అన్నాడు.

కాంతం చేతులు పైకెత్తి సగంవిప్పిన చొక్కాకిందినించి ప్రశ్నార్థంగా చూశాడు.

"నేనా అలమార్లో కొంతడబ్బు పెట్టానూ! నువ్వేమైనా, ఒకవేళ, అదేమైనా చూళ్లేదుగదా?" అన్నాడు ప్రతిమాట చివరా తెలివిగా గొంతు సవిరించుకుంటూ.

ఈ భాగ్యానికేనా ఇన్నట్టు చొక్కా ఊడదియ్యటం పూర్తిచేసి కాంతం, "చూడకేం? అది పోస్టాఫీసులో నా పేర సేవింగ్సుడిపాజిట్ చేసి వస్తున్నానిప్పుడే! ఆ డబ్బుకోసం ఇంటిల్లిపాతీ నిద్రాహారాలు మాని కూర్చోలేదుగద!" అంటూ గదిలోకి వెళ్లాడు.

శివయ్యగారిని మళ్లీదిగు లావేశించింది. కాంతం చదువైపోయింది; వాడిక ఇంటోనేఉండి డబ్బు తనచేతిమీదిగానే వాడతాడు.

శివయ్యగారి నోట్లో మెతుకులు మట్టి అయినై.

FREE!

మీరు నెలకు రు 675 లు సంపాదించవలెనన్నచో మా అసలు అమెరికన్ న్యూగోల్డు పూర్తి వివరములకు వ్రాయుడు. ఇది గీటురాతిపై మంచి బంగారమువలె నుండి తీగగాను రేకులుగాను తయారుచేయవచ్చును. అన్నిరకముల ఆభరణములు మావద్ద కలవు 6 తు॥ల అమెరికన్ న్యూగోల్డు, 2 జతల ఫాన్సీగాజులు, 2 జతల కమ్మలు, రెండు ఉంగరములు శాంపిలుగా పంపబడును.

ఉచితము:—ఆభరణముల క్యాటలాగు పూర్తివివరములతో ఉచితము. నేడే వ్రాయుడు. (A-2/85)

AMERICAN NEW GOLD COMPANY,
P. B. 61 (A. P. M.) LAHORE (India).